నివాళులర్పిస్తున్న ఆలూరు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

ఉచితానికి

'ఒరిజినల్' కష్టాలు

- ఆధార్, ఓటర్‌కార్డు తప్పకుండా చూపాలంటున్న కండక్టర్లు
- చూపకపోతే జీరో టికెట్‌కు నిరాకం
- ఫోన్‌లో చూపినా సరిపోతుందన్న సిఎం ఆదేశాలు బేఖాతరు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

'మహిళలు గుర్తింపు కార్డును ఫోన్‌లో సాఫ్ట్‌కాపీ చూపించినా ఉచిత ప్రయాణానికి అనుమతించండి' ఇదీ స్వయానా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షలో అధికారులకు ఇచ్చిన ఆదేశాలు. జిల్లాలోని ఆర్‌టిసి బస్సుల్లో ఒరిజినల్ ఆధార్, ఓటర్ కార్డు చూపకపోతే కండక్టర్లకు జీరో టికెట్ జారీ చేయడం లేదు. డబ్బులు పెట్టి టికెట్ కొనాలంటూ ఉచిత సలహా ఇస్తున్నారు. దీనిపై మహిళల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది...

ఉచిత బస్సు ప్రయాణాన్ని జిల్లా మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఉచితంగా బస్సులలో ప్రయాణం ఉండటంతో మహిళలు జిల్లాలో ఆర్‌టిసి బస్సుల్లో రద్దీ పెరుగుతోంది. జిల్లాలో ఇప్పటి వరకూ దాదాపు 5 లక్షల మంది స్త్రీ శక్తి ద్వారా జీరో టికెట్‌తో ప్రయాణించారు. మహిళల ఉచిత ప్రయాణానికి ఒరిజినల్ గుర్తింపు కార్డు సమస్య ఎదురవుతోంది. ఇటీవల ఆర్‌టిసి అధికారులు నిర్వహించిన సమీక్షలో ఫోన్‌లో సాఫ్ట్ కాపీ చూపించినా మహిళలకు ఉచిత ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అయితే క్షేత్ర స్థాయిలో ఆ ఆదేశాలు అమల్లోకి రాలేదు. జిరాక్స్ కాపీలను, ఫోన్‌లో ఉన్న ఆధార్ కార్డులను చూపించినా కండక్టర్లు ఒప్పుకోవడం లేదు. చివరికి కలర్ ప్రింట్‌తో ల్యామినేషన్ చేసిన చిన్న సైజ్ ఆధార్ కార్డులను కూడా కండక్టర్లు ఒప్పుకోవడం లేదు. ఫుల్ ఆధార్ కార్డులను తెచ్చుకోవాలని చెబుతున్నారు. కర్నూలు నుంచి ఆదోనికి రూ.130 ఛార్జీ ఉంది. రాను పోను రూ.260 అవుతుంది. ఒరిజినల్ ఆధార్ లేదని కొందరు మహిళలకు జీరో టికెట్ జారీ చేయకపోవడంతో వారు రూ.260 నష్టపోతున్నారు. అలాగే కర్నూలు నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో పత్తికొండకు రూ.110, ఎమ్మిగనూరుకు రూ.100, మంత్రాలయంకు రూ.130 ఛార్జీ ఉంది. ఆ బస్సుల్లో ఒరిజినల్ ఆధార్ లేకుండా బస్సు ఎక్కే మహిళలు వందల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. గుర్తింపు కార్డు ఒరిజినల్ ఉంటేనే ఉచిత బస్సుల్లో ప్రయాణానికి కండక్టర్లు అనుమతించడం పట్ల మహిళలు పెదవి విరుస్తున్నారు. ప్రతి సారి ఒరిజినల్ కార్డులు వెంట తెచ్చుకోలేమనే అభిప్రాయాన్ని మహిళలు వ్యక్తం చేస్తున్నారు. ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు సెల్‌ఫోన్లలో చూపించినా ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని మహిళలు కోరుతున్నారు.

సిఎం ఆదేశాలను అమలు చేయాలి

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఒరిజినల్ గుర్తింపుకార్డులు ఉండాలని చెప్పడం సరైనది కాదు. ఫోన్‌లో గుర్తింపుకార్డులు చూపించినా జీరో టికెట్ జారీ చేయాలి. ఫోన్‌లో చూపించినా అనుమతి ఇవాల్వని ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాలను తక్షణమే అమలు చేయాలి.

- ఎన్.అలివేలు, ఐద్వా జిల్లా కార్యదర్శి.

ఒరిజినల్ లేకుంటే టికెట్ కొడుతున్నారు

బస్సులో ఉచిత ప్రయాణానికి ఒరిజినల్ ఆధార్ అడుగుతున్నారు. ఒరిజినల్ ఆధార్ లేకుంటే మామూలు టికెట్ కొడుతున్నారు. జిరాక్స్ ఆధార్ కార్డు చూపించినా ఫ్రీ టికెట్ కొడితే డబ్బులు అంతో ఇంతో మిగులుతాయి.

- భాగ్యమ్మ, ప్రయాణికురాలు, కొణిదెల

చిగిలి.. శోకసంద్రం...

- అశ్రు నయనాల మధ్య చిన్నారుల అంత్యక్రియలు - పలువురు నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని చిగిలి గ్రామం శోకసంద్రంలో మునిగింది. నీటి కుంటలో పడి మృతి చెందిన చిన్నారుల అంత్యక్రియలు గురువారం అశ్రు నయనాల మధ్య సాగాయి. మృతి చెందిన విద్యార్థి మహబూబ్ బాషా అంత్యక్రియలు ముస్లిం సంప్రదాయం ప్రకారం నిర్వహించారు. వినయ్, శశి కుమార్, కిన్నెర సాయి, సాయి కిరణ్, భీమేష్ అంత్యక్రియలు హిందూ సంప్రదాయం ప్రకారం సాగాయి. చిన్నారుల మృతదేహాలను అంత్యక్రియలకు తరలిస్తున్న సమయంలో కుటుంబ సభ్యులు, బంధువుల రోధనలు మిన్నంటాయి. 'ఇక మాకు కరువయ్యావురా' అంటూ తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ రోధించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. గ్రామంలో ఎక్కడ చూసినా చిన్నారుల మృతిపై ఆవేదన చెందుతున్నారు.

పలువురు నాయకుల పరామర్శ

చిగిలి గ్రామంలో నీటి కుంటలో పడి ఆరుగురు చిన్నారులు మృతి చెందిన సంఘటన బాధాకరమని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఆలూరు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్, జనసేన ఆదోని ఇన్‌ఛార్జీ మల్లప్ప, వైసిపి జిల్లా మహిళా అధ్యక్షులు శశికళ, కురువ కార్పొరేషన్ డైరెక్టర్ కెసి.ఉదయ్ కుమార్ తెలిపారు. చిన్నారుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతి చెందిన ఆరుగురు చిన్నారుల కుటుంబాలకు రూ.10 వేల చొప్పున రూ.60 వేలను ఆలూరు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ ఆర్థిక సహాయం అందించారు. వారు మాట్లాడుతూ... మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. టిడిపి, జనసేన మండల కన్వీనర్లు పరమా రెడ్డి, అరవింద్, ప్రధాన కార్యదర్శి శేషాద్రి నాయుడు, నాయకులు మధు, రాజ్‌కుమార్, యుగంధర్, సతీష్, ప్రభాకర్, నెట్టప్ప పాల్గొన్నారు. మృతుల కుటుంబాలను పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, సిఐ గంగాధర్, జడ్‌పిటిసి దొరబాబు, వైసిపి మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, సర్పంచి జయమ్మ, ఎంపిటిసి రాధాకృష్ణ, ఎంఇఒలు రాజేంద్ర ప్రసాద్, తిరుమలరావు పరామర్శించారు.

సిపిఎం నాయకుల పరామర్శ

నీటి కుంటలో పడి చిన్నారులు మృతి చెందడం బాధాకరమని సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు. బాధిత కుటుంబాలను వారు పరామర్శించారు. వారు మాట్లాడుతూ... విద్యార్థుల మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా కొండ ప్రాంతాల్లో గుంతల తవ్వి మట్టి అమ్ముకుంటున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు రంగస్వామి, రామాంజనేయులు, ఈరన్న, ప్రకాష్, ఇబ్రహీం, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తరుణ్ పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్

నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియ వేగవంతం

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి- క్రిష్ణగిరి /వెల్దుర్తి

ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం క్రిష్ణగిరి మండల కేంద్రంలోని ఆముదం పంటను పరిశీలించి, ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్న విధానాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ ఆముదం పంటను పరిశీలిస్తూ ఆముదం పంట పండిస్తున్న రైతు మధుతో మాట్లాడుతూ ఆముదం పంటకు ఎకరానికి ఎంత పెట్టుబడి పెడుతున్నారు. ఎకరానికి ఎంత లాభం వస్తుందని రైతును అడిగి తెలుసుకున్నారు. ఎఒతో మాట్లాడుతూ... ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్న విధానాన్ని కలెక్టర్ పరిశీలిస్తూ, ఇప్పటివరకు ఎన్ని ఎకరాలు ఈ క్రాప్ బుకింగ్ చేశారని కలెక్టర్ వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో పంట నష్టం ఎన్యూమరేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. యూరియాకు సంబంధించి ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రైతులు భూసార సంరక్షణకు వీలుగా నానో యూరియాను వాడాలని కలెక్టర్ సూచించారు..

జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగును ప్రోత్సహించండి

జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగును ప్రోత్సహించి, రైతులకు ఆయిల్ పామ్ సాగు ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ పంట సాగు చేస్తున్న రైతు బ్రహ్మానందరెడ్డి పొలాన్ని కలెక్టర్ పరిశీలిస్తూ, ఎన్ని ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట సాగు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటడానికి సంవత్సరానికి రైతులకు ప్రభుత్వం హెక్టార్ కు రూ. 5,250 సబ్సిడీ ఇవ్వడంతో పాటు , అంతర పంటలు వేసుకునేందుకు రూ.5,250 మంజూరు చేస్తుందని తెలిపారు. అందుకు సంబంధించిన డబ్బులు జమ అయ్యాయా అని కలెక్టర్ రైతును అడిగి తెలుసుకున్నారు. నిధులు జమ అయ్యాయని రైతు తెలిపారు. క్రిష్ణగిరి మండ లంలో ఇప్పటివరకు ఎన్ని ఎకరాలలో ప్లాంటేషన్ చేశారని కలెక్టర్ హార్టికల్చర్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. 30 హెక్టార్లలో సాగు చేశామని హార్టికల్చర్ అధికారి తెలిపారు. రైతులు పత్తి, కంది, మినుము, పెసర తదితర పంటలతో అంతర పంటల సాగు చేసుకోవాలని సూచించారు.

హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్‌ను పరిశీలించిన కలెక్టర్

హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలిస్తూ ఉమ్మడి జిల్లాలో ఉన్న 68 చెరువులకు ఇప్పటివరకు పూర్తి స్థాయిలో నీరు అందించామని కలెక్టర్ తెలిపారు.. హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ సమీపంలో ఉన్న ఒక రైతు పొలం నుండి పైప్ లైన్ వేసినట్లయితే 200 ఎకరాల పొలం సాగులోకి వస్తుందని అందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కొంతమంది రైతుకు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఒకసారి ఈ అంశాన్ని పరిశీలించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇని ఆదేశించారు. హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇ పాండురంగయ్య , జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, హెచ్ఎన్ఎస్ఎస్ ఇఇ ప్రసాద్, ఎంపిడిఒ మోహన్ కుమార్, మండల వ్యవసాయ అధికారి మహేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ నరేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

వర్షాలకు నష్టపోయిన రైతులకు

పరిహారం ఇవ్వాలి

-ప్రభుత్వ ఆదుకోవాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఇటీవల జిల్లాలో పది రోజులపాటు కురిసిన వర్షాల వల్ల తొమ్మిది మండలాల్లో దాదాపు 25 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని అలాంటి రైతులకు ఎకరాకు రూ.30 వేల ఆర్థిక సహాయం ప్రభుత్వం అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సిపిఎం ప్రతినిధి బందం వర్షాల వల్ల నష్టపోయిన పంటలను జిల్లాలో పరిశీలించిందన్నారు. దాదాపు 25 వేల ఎకరాల్లో పంట నష్టపోయారని తెలిపారు. ప్రధానంగా పత్తి మొదటి కాపు మొత్తం భూమిలో రాలిపోయిందని, కొన్ని చోట్ల మొత్తం పంట అంతా దెబ్బతిన్నదన్నారు. రైతులకు ఏమీ మిగలదన్నారు. జిల్లాలో వేరుశనగ ,మొక్కజొన్న, టమోటా, పచ్చిమిర్చి, ఉల్లి పంటలు దెబ్బతిన్నాయని తెలిపాడు. పెద్దకడబూరు మండలం హులికన్వి గ్రామంలో మొత్తం వేసిన పంట అంతా 24 హెక్టార్లలో నష్టం జరిగిందనాన్నారు. ప్రజలు ఖాళీ చేతులతో నిలిచిన పరిస్థితి ఉందని, అలాంటి చోట తక్షణమే ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశాడు. జిల్లాలో దౌర్భాగ్య పరిస్థితి ఏమంటే జిల్లా అధికారులు , రెవెన్యూ అధికారులు, అగ్రికల్చర్ అధికారులు , ఇంత జరిగినా పరిశీలించకపోవడం దౌర్భాగ్యమన్నారు. ప్రజాప్రతితులు కూడా పరిశీలించిన పరిస్థితి లేదని ,రైతులు ఏమైతే మాకెందుకు అనే పరిస్థితుల్లో అధికార యంత్రాంగం పాలకవర్గం ఉన్నదని ఘాటుగా విమర్శించాడు. ఆస్పరి మండలం వలిగొండ గ్రామం ఈ వర్షాల వల్ల మొత్తం మునిగిపోయిందన్నారు. పక్కలోనే వంక ఉండడంతో రాకపోకలు దాదాపు రెండు రోజులపాటు నిలిచి పోయిందన్నారు. ప్రభుత్వం తక్షణమే వలగొండ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే పంట పొలాలను సర్వే చేసి నష్టం జరిగిన రైతాంగాన్ని ఆదుకోవడం కోసం ప్రణాళికలు పంపించాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, టి రాముడు మాట్లాడుతూ ఆదోని వ్యవసాయ మార్కెట్లో అధిక వర్షాల వల్ల వందల క్వింటాళ్ల వేరుశనగ నీటిపాలయిందన్నారు. రైతుల గోడు వర్ణనాతీతంగా ఉన్నదని, నీళ్లలో కొట్టుకుపోతున్న వేరుశనగను అడ్డంపడి నిలుపుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. కోట్ల వ్యాపారం జరిగే ఆదోని మార్కెట్లో షెడ్లను తగిన సంఖ్యలో నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు మండలాల వారీగా సర్వేలు చేసి నివేదికలు పంపించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బాధ్యతలు స్వీకరించిన పార్వతమ్మ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

విజయవాడ గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా కె.పార్వతమ్మ గురువారం పదవి ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి , టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్ , తెలంగాణ మాజీ స్పీకర్ ప్రస్తుత ఎమ్మెల్సీ మధుసూదన్ ఆచారి , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి, శాఖ అధికారులు పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్లలో కూడా దిగజారుడు తనం ఏంటి?

ప్రజాశక్తి కర్నూలు కార్పోరేషన్

వికలాంగులకు కూడా దిగజారుడు తనమేంటి. విచారణ పేరుతో పింఛన్ల ఎత్తివేతకు పాల్పడితే ఊరుకోబోమని వికలాంగుల సంఘం నాయకులు హెచ్చరించారు. గురువారం కర్నూలు నగరంలోని కార్మిక కర్షక భవన్‌లోని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యాలయంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎన్‌పిఆర్‌డి జిల్లా అధ్యక్షులు రాజామనెమ్మ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఉద్దేశించి కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి. ఆనంద్ బాబు, ఎన్‌పిఆర్‌డి జిల్లా కార్యదర్శి గోపాల్, ఉపాధ్యక్షులు రాధ, దివ్యాంగుల సాధికార ఫోరం అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, శివశంకర్, ఉపాధ్యక్షులు వెంకటేష్, డిఆర్‌డబ్ల్యుఎఫ్ నాయకులు మస్తాన్ వలి, వికలాంగుల ఆదరణ సేవా సమితి నాయకులు మరియదాసు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా, గురుశేఖర్, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు నాగ సుంకన్న పాల్గొని మాట్లాడారు. ఎంక్వయిరీ పేరుతో ఏరివేత ప్రోగ్రాంకు రాష్ట్ర ప్రభుత్వం స్వీకారం చుట్టిందని, తప్పుడు సర్టిఫికెట్లు పొందిన వాళ్లను తీసేస్తే , ఇబ్బంది లేదని, ప్రభుత్వం ఎలాంటి విచారణ లేకుండానే 90 శాతం వికలాంగత్వం కలిగిన వాళ్లకు సైతం 40 శాతం వికలాంగత్వం ఉన్నట్లుగా సర్టిఫికెట్ జారీ చేయడం అంటేనే వాళ్లను సంపూర్ణంగా సంక్షేమ పథకాలకు దూరం చేయడమే అన్నారు. 40 రకాలుగా ఉన్న వికలాంగులమంతా ఐక్యమై పెన్షన్ల రక్షణ కోసం సంక్షేమ పథకాల సాధన కోసం పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని సహకరించాలన్నారు. కార్యక్రమంలో వికలాంగుల నాయకులు నబీరసూల్, మౌలాలి, పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

-వేతనాలు పెంచాలి-ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలి

-మండల కార్యాలయాల ముందు ధర్నాలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అంగన్వాడి టీచర్లు, ఆయాల వేతనాలు పెంచాలని అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. అంగన్వాడి వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కల్లూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి తహశీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు సిఐటియు మండల కార్యదర్శి కె.మధు మాట్లాడుతూ 2024లో గత ప్రభుత్వాలు 45 రోజులపాటు సమ్మె చేసిన సందర్భంగా అప్పుడున్న రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడం వలన ఇప్పుడున్న ప్రభుత్వం వేతనాలు పెంచడంలో అలసత్వం వహిస్తుందని అన్నారు. సిఐటియు న్యూ సిటీ నాయకులు ఎస్.మహమ్మద్ రఫీ, అంగన్వాడి టీచర్లు వెంకటేశ్వరమ్మ, లక్ష్మీదేవి, పద్మ, ఆదిలక్ష్మి, పద్మజ, అంజు, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ ఎస్ ను రద్దు చేయాల్సిందే

పత్తికొండ: అంగన్వాడి టీచర్లకు ఆయాలకు ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాల్సిందేనని సిఐటియు మండల కార్యదర్శి ఎం రవిచంద్ర డిమాండ్ చేశారు. గురువారం ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ పిలుపుమేలుకు పత్తికొండ పట్టణంలోని ఈశ్వర్ రెడ్డి భవనం నుండి అంగన్వాడి టీచర్లు ఆయాలు సిఐటియు నాయకులు ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం వరకు వెళ్లి ధర్నా నిర్వహించారు. సిఐటియు ప్రాజెక్టు అధ్యక్షురాలు చిట్టెమ్మ, మండల కార్యదర్శి ఎం రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 5జి మొబైల్ లను తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు నాయకులు, అంగన్వాడి టీచర్లు తహశీల్దార్‌హుస్సేన్ సాహెబ్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సిఐటియు మండల అధ్యక్షులు గోపాల్, సావిత్రిబాయి, అంజనమ్మ, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

మండల అధికారికి వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు జె.మోహన్ అంగన్‌వాడీలు

అంగన్వాడీల వేతనాలు పెంచాలి

కోడుమూరు: అంగన్వాడీల వేతనాలు పెంచాలని కోడుమూరు తహశీల్దార్ ఆఫీస్ వద్ద అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కు ప్రాజెక్టు నాయకురాలు శూలమ్మ అధ్యక్షత వహించారు. సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు గఫూర్ మియా, జిపి వీరన్న మాట్లాడారు. సూలమ్మ, అరుణ, హైమావతి, రజియా, భాగ్యమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

సి బెళగల్ : ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ఇచ్చిన హామీలను, పోరాట సమయంలో డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని సిఐటియు డివిజన్ నాయకులు జె మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అంగన్వాడీల మండల అధ్యక్షులు అనంతమ్మ, సరోజమ్మలు ఎన్టీఆర్ పార్కు వద్ద ఆందోళన చేపట్టారు. సిఐటియు నాయకులు మోహన్ మద్దతు తెలిపి మాట్లాడారు.

కర్నూలు కలెక్టరేట్: అంగన్వాడీలకు ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సిఐటియు జిల్లా నాయకులు జి శ్రీధర్ డిమాండ్ చేశారు. గురువారం ఓర్వకల్లు మండల కేంద్రంలో అంగన్వాడీలు ప్రజాసంఘాల ఆఫీసు నుండి పెద్ద ఎత్తునర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం వెళ్లి అఫీసు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. జి శ్రీధర్ సిఐటియు మండల అధ్యక్షులు ఎస్.షాజహాన్ పాల్గొని మాట్లాడారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

పత్తికొండలో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రధాన రహదారులపై పొంచి ఉన్న ప్రమాదం

నాసిరకం నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి-పిపిఎస్ఎస్ నాయకులు పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో నాసిరకం నిర్మాణాల వల్ల రోడ్లు భవనాల శాఖ నగరపాలక సంస్థ జాతీయ రహదారుల సర్వీసు రోడ్లు, కల్వర్టుల శిథిలావస్థకు చేరి వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, సివి వర్మ, కె .మధుసూదన్, ఎ. సుదర్శన్ యాదవ్ తెలిపారు. గురువారం పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం ఐటిసి కంపెనీ సమీపంలో హైవే సర్వీస్ రోడ్డు కల్వర్టులో దిగబడ్డ లారీని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరం లో పలు శాఖల రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయని అన్నారు. రాఘవేంద్ర నగర్ సమీపంలో హైవే సర్వీస్ రోడ్లు చివరిలో ఉన్న కల్వర్టులో లారీ దిగబడింది. డ్రైవర్ చాకచక్యంగా వల్ల త్రుటిలో ప్రమాదం తప్పిందిదని స్థానికులు తెలిపారు. నెల క్రితం పూలబజార్ కూడల్లో ఒక లారీ ఇలాగే కల్వర్టులో దిగబడిందని గుర్తు చేశారు. నాసిరకం నిర్మాణాల వల్ల నగరపాలక సంస్థ, రోడ్లు భవనాల శాఖ, జాతీయ రహదారుల శాఖ రోడ్లు, కల్వర్టులు శిథిలావస్థకు చేరుతున్నాయని అన్నారు. అన్ని శాఖల ప్రధానరోడ్డులో పరిశీలించి నాసిరకం నిర్మాణాలపై చర్యలు తీసుకొని ప్రజాధనాన్ని కాపాడి ప్రమాదాలను అరికట్టాలని కోరారు. కాలనీ వాసులు కె.పెద్దన్న, ఎన్. అమర్నాథరెడ్డి, పిపిఎస్–ఎస్ నాయకులు కె.శ్రీనివాసులు ఎండి యూనుస్, షేక్ అన్వర్ భాష, పురుషోత్తం రెడ్డి, కే మల్లేష్ పాల్గొన్నారు.

రోడ్డుపై పడిన గోతిని పరిశీలిస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు

చెన్నరాయని తిప్పను నీటితో నింపాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

చెన్న రాయని తిప్ప రిజర్వాయర్‌ను నీటితో నింపి పంట కాలువలు ఏర్పాటు చేసి సాగునీరు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ ,సహాయ కార్యదర్శి ఎ.కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం జలమండలి కార్యాలయ నిర్వహణ అధికారికి వారు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాల క్రితం రిజర్వాయర్ నిర్మించినప్పటికీ ఏమాత్రం ఉపయోగం లేకుండా ఉందన్నారు. ప్రజాధనాన్ని రూ.కోట్లల్లో వృథా చేశారు తప్ప ఉపయోగించలేకపోయిందన్నారు. ఈ సంవత్సరం సంపూర్ణంగా వర్షాలు కురుస్తున్నాయని, వర్షం నీరంతా సముద్రంలో కలిసిపోతుందన్నారు. అందులో గాజులదిన్నె ప్రాజెక్టు నుండి చెన్నరాయన తిప్ప రిజర్వాయరుకు రెగ్యులర్‌గా నీటిని నింపి పంటకాల్వలు ఏర్పాటు చేసినట్లయితే కల్లూరు మండలం మొత్తం సస్యశ్యామలం కావడానికి అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ప్రాజెక్టులపైన శ్రద్ధ లేకపోవడం వలన ఇన్ని సంవత్సరాలుగా ప్రజాధనం దుర్వినియోగం అయిందన్నారు. ఇప్పటికైనా గాజులదిన్నె ప్రాజెక్టు ద్వారా చెన్నరాయని తిప్ప రిజర్వాయర్‌ను నింపాలన్నారు. ప్రభుత్వం స్పందించక పోతే అన్ని సంఘాలతో ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

అధికారికి వినతి ఇస్తున్న జి.రామకృష్ణ , ఎ.కృష్ణ



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బుగ్గతండా రైతులు

బుగ్గతండా రైతులకు రస్తా చూపండి

ప్రజాశక్తి-పత్తికొండ రూరల్

పత్తికొండ మండల పరిధిలోని పత్తికొండ గ్రామ రెవెన్యూ లో ఉన్న బుగ్గ తండా గ్రామస్తులు అయిన 960/4,962/2 సర్వేనెంబర్ గల పొలాల రైతులు వాళ్ల సాగులో ఉన్న పొలాలకు వెళ్లడానికి నానా అగచాట్లు పడుతున్నారు. మా పొలానికి దారి చూపించండి సార్ అంటూ రెవెన్యూ అధికారులను గత కొన్ని ఏళ్ల నుండి వేడుకుంటున్నారు. గురువారం పత్తికొండ తహశీల్దార్ హుస్సేన్ సాహెబ్‌కు వినత పత్రం అందజేసారు. ఆనంతరం రైతులు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా నడుస్తున్న రస్తాను గుండు తండా కు చెందిన పార్వతి భర్త సోమ్లానాయక్‌లు అడ్డుకోవడంతో మా పొలాలకు ఎలా పోవాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. బుగ్గతండా గ్రామస్తులులోక్యనాయక్, రామచంద్రనాయక్, వెంకటప్ప నాయక్, సోమ్లానాయక్, రెడ్డి నాయక్, గోబ్రే నాయక్, మల్లయ్య,హేమ్లా నాయక్, గజ్జే నాయక్,లు వాపోయారు.

రైతులకు సరిపడ యూరియా అందించాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

నిరసన చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రైతాంగానికి సరిపోయే యూరియాను అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, ఉపాధ్యక్షులు మల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం ఎడిఎ కార్యాలయం ముందు నిరసన చేపట్టి, ఎడిఎ బాలవర్ధిరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులకు యూరియా పంపిణీ సక్రమంగా జరగడం లేదని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. తక్షణమే యూరియా తెప్పించి రైతులకు పంపిణీ చేయాలని కోరారు. ఆర్ఎస్కెలు, సొసైటీల ద్వారా, ఎరువుల షాపుల ద్వారా సరిపడనంత యూరియాను అందిస్తున్నామని అధికారులు, ప్రభుత్వాలు చెబుతున్నాయని, వాస్తవంగా ముందుగానే డబ్బులు చెల్లించినా నేటి వరకు యూరియా సక్రమంగా రైతులకు అందడం లేదని తెలిపారు. రూ.1,300 నుంచి 1,800 వరకు చెల్లించి కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం యూరియాకు ఇచ్చే సబ్సిడీని ఎత్తేయాలని సక్రమంగా అందించడం లేదని తెలిపారు. తక్షణమే యూరియా తెప్పించాలని, ఎలాంటి లింకులూ పెట్టకుండా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదోని, కౌతాళం మండల కార్యదర్శులు అయ్యప్ప, ఈరన్న, వ్యకాస నాయకులు లింగన్న, తిక్కన్న, రైతు సంఘం నాయకులు హనుమంతు రెడ్డి, అబ్బాస్, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టండి

- కాంట్రాక్టర్లకు ఛైర్పర్సన్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఆదోని

అభివృద్ధి చెందాలంటే సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం, తాగునీటి సరఫరా పైపులైను ఏర్పాటు వంటి పనులు జరగాలని మున్సిపల్ ఛైర్పర్సన్ లోకేశ్వరి తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్పర్సన్ లోకేశ్వరి

గురువారం మున్సిపల్ కార్యాలయంలోని ఛైర్మన్ ఛాంబర్లో అకౌంట్ ఆఫీసర్ రవికుమార్, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న బిల్లుల చెల్లింపునకు చొరవ చేసుకున్న టెక్నికల్ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఇప్పటికే 12 పనులకు సంబంధించి రూ.కోటికి పైగా బిల్లులు చెల్లింపు పెండింగ్లో ఉన్నాయని కాంట్రాక్టర్లు ఆమె దృష్టికి తెచ్చారు. బిల్లులు త్వరగా మంజూరు చేస్తే పనులు చేపట్టేందుకు అభ్యంతరం లేదని కాంట్రాక్టర్లు చెప్పారు. ఇప్పటి నుంచి ఎలాంటి ఇబ్బంది లేకుండా త్వరగా బిల్లులు మంజూరయ్యేలా చూస్తామని, పనులు మొదలు పెట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావాలని ఛైర్పర్సన్ కోరారు. వైస్ ఛైర్మన్ నరసింహులు, కాంట్రాక్టర్లు జైపాల్, రఘు, వీరేష్, డిఇ రామమూర్తి ఉన్నారు.

ఎట్టకేలకు వీధి పశువుల తరలింపు

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరులో కొన్నేళ్ల నుంచి ప్రజలను వేధిస్తున్న వీధి పశువుల సమస్యను పరిష్కరించారు. గత వారంలో మాజీ ఎమ్మెల్యే తనయుడు పద్మనాభ దాసు ఎద్దు పొడిచి మృతి చెందారు. గతంలో అనేక మంది మహిళలు, చిన్నారులను గాయపరచిన సంఘటనలూ ఉన్నాయి.

తరలిస్తున్న పోలీసులు, అధికారులు

వీధి పశువుల నుంచి ప్రజలను కాపాడాలని సిపిఐ నాయకులు పి.హనుమంతు, కెపి.నారాయణ స్వామి ఆధ్వర్యంలో రాస్తారోకో, ఆందోళనలు చేసి పంచాయతీ కార్యదర్శికి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు అధికారులు స్పందించి గురువారం ఐదు వీధి పశువులను ఆదోని పంజారా పోల్ గోశాలకు తరలించినట్లు సిఐ బాలస్వామి, ఎస్ఐ మహబూబ్ బాష, డిప్యూటీ ఎంపిడిఒ ఫరూక్ రఫీ, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. పట్టణంలో తిరిగే వీధి పశువుల యజమానులు తమ పశువులను ఇంటి దగ్గర ఉంచుకోవాలని, లేకపోతే పశువులను గోశాలకు తరలించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంజిహళ్లి సర్పంచి మృతి

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని గంజిహళ్లి సర్పంచి తోలు లింగమ్మ (72) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. లింగమ్మ గత సర్పంచి ఎన్నికల్లో వైసిపి మద్దతుతో సర్పంచిగా గెలుపొందారు. గురువారం బంధువుల పెళ్లికి వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తుండగా బి.అగ్రహారం, బైలుప్పల గ్రామాల మధ్య మోటార్ సైకిల్ అదుపు తప్పి కింద పడ్డారు. తలకు గాయమై చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు గంజిహళ్లి గ్రామంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

భయపెడుతున్న వీధికుక్కలు

- కుక్కల వల్ల హడలిపోతున్న విద్యార్థులు - అజాగ్రత్తగా ఉంటే ప్రమాదం తప్పదు

ప్రజాశక్తి - చిప్పగిరి

వీధి కుక్కలు ప్రజలను, విద్యార్థులను భయపెడుతున్నాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం బారిన పడే ప్రమాదం ఉంది. కుక్కల నుంచి కాపాడాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

చిన్నపిల్లలపై కుక్కలు దాడులు చేయడమే కాక ప్రాణాలు సైతం తీసిన సంఘటనలు ఈ మధ్య మనం చూస్తూనే ఉన్నాం. ఏదైనా జరిగితే తప్ప ఏ అధికారి పట్టించుకోవడం లేదు. చిప్పగిరి బస్టాండ్ సమీపంలో ఉన్న కుక్కల గుంపును చూసి విద్యార్థులే కాదు.. పెద్దలు కూడా భయపడే పరిస్థితి దాపురించింది. అలాగే నేమకల్లు గ్రామంలో ప్రధాన రహదారిలో ప్రతినిత్యం విద్యార్థులతో పాటు అనేకమంది తిరుగుతుంటారు. ఈ రహదారిలో కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉంది. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా పిల్లలతో పాటు పెద్దలను సైతం

నేమకల్లులోని రహదారిలో ఇంటి ముందు ఉన్న కుక్కల గుంపు

కరిచే ప్రమాదం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని స్థానికులు తెలుపుతున్నారు. చిన్నపిల్లలు ఏమైనా వస్తువులు కవర్లో తీసుకెళితే వెంటనే ఆ కవర్లను ఎత్తుకెళ్లి చిందరవందరగా కొరికి మనుషులపైకి దాడికి వస్తున్నాయి. గతవారంలో చిప్పగిరిలో ఒక విద్యార్థి కుక్కల గుంపును తరలించడానికి వెళితే ఆ కుక్కలన్నీ మీదకొచ్చాయి. అదృష్టం బాగుండి.. అక్కడ బస్సు ఎక్కడానికి ఉన్న వారంతా వాటిని తరిమేశారు. అలాంటి సమయంలో ఎవరూ లేకపోతే ప్రాణాల మీదకు వచ్చే ప్రమాదం ఉంది. బస్టాండ్ ప్రాంతంలో నిత్యం రద్దీగా ఉన్నా వాటిని చూస్తూనే భయపడే పరిస్థితి ఉంది. మండలంలోని కొన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. చిన్నపిల్లలను బయటకు పంపించాలంటే కూడా భయపడే పరిస్థితి ఉంది. బస్టాండ్ దగ్గర పలు హోటళ్లు, చికెన్ షాపులు ఉండడంతో కుక్కల గుంపు అంతా అక్కడే ఉంటోంది. రోడ్డు వెంట పోయేవారు, వచ్చేవారు కూడా చాలా జాగ్రత్తగా వెళ్లే పరిస్థితి ఉంది. ఏదైనా ప్రమాదం జరగకుండా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే కుక్కల బెడద నుంచి కాపాడి వాటిని తరలించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కుక్కల బెడదను నివారిస్తాం

- పంచాయతీ కార్యదర్శి బాలన్న, నేమకల్లు గ్రామం

చిప్పగిరితో పాటు అనేక గ్రామాల్లో కుక్కల బెడద ఈ మధ్య ఎక్కువయింది. వాటికి సంబంధించిన అధికారులతో మాట్లాడి కుక్కల గుంపును తరలించడానికి ప్రయత్నిస్తాం. ముందుగా ప్రతి ఒక్కరూ కుక్కల గుంపు ఉన్నప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

వీధి కుక్కలతో గ్రామస్తుల బెంబేలు

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - హోళగుంద

వీధి కుక్కలతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. హోళగుందతోపాటు మండలంలోని ఎల్లార్తి, వందవాగిలి, గజ్జహళ్లి, హెబ్బటం, సులువాయి తదితర గ్రామాల్లో ఏ వీధిలోకి వెళ్లినా కుక్కల గుంపు దర్శనమిస్తోంది. మంచి కుక్కలు, పిచ్చి కుక్కలు కలిసి తిరగడంతో కుక్కల నుంచి ఎలా తప్పించుకోవాలో తెలియడం లేదు. ఆదమరిచి తిరిగితే అంతే.. కుక్క కాటుకు బలి కాక తప్పదు. రాత్రి 8 గంటలు దాటితే టూ వీలర్పై వెళ్తున్న వారిని వెంటాడి మరీ దాడికి ప్రయత్నిస్తున్నాయి. ఒకప్పుడు వీధిలో కుక్కలు ఒకటో, రెండో ఉండేవి. అవి కూడా కొత్త వ్యక్తులు ఆ వీధుల్లోకి ప్రవేశిస్తేనే మొరిగేవి. ఇప్పుడు ప్రతి వీధిలోనూ, ఎటు చూసినా కుక్కలే కనిపిస్తున్నాయి. అత్యవసర సమయంలో కాలినడకన బయల్దేరితే వెంట పడుతున్నాయి. ఇంటి కాపరులుగా ఉండే కుక్కలు ఇంటి యజమానులను సైతం కొరికిన సంఘటనలు ఉన్నాయి. చిన్నారుల పరిస్థితి మరి దారుణం. తల్లిదండ్రులు జాగ్రత్త పడకపోతే ప్రమాదం తప్పదు. హోళగుంద మేజర్ పంచాయతీ అధికారులు స్పందించి గ్రామం నుంచి కుక్కలను తరలించేందుకు కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

హోళగుందలో ఉన్న కుక్కల గుంపు (ఫైల్)

బాలునిపై వీధి కుక్కల దాడి

ప్రజాశక్తి - చిప్పగిరి

ఐదేళ్ల బాలునిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచిన సంఘటన మండలంలోని నంచర్ల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల వివరాల మేరకు... నంచర్ల గ్రామానికి చెందిన వంచేటి లత, వంచేటి మహేష్కు ఐదేళ్ల కుమారుడు గౌతమ్ ఉన్నాడు. గౌతమ్ గురువారం ఉదయం ఇంటి దగ్గర ఆడుకుంటుండగా వీధిలో ఉన్న కుక్కల సమూహం ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాయి. చుట్టుపక్కల వారు గమనించి కుక్కలను కట్టెలతో తరమడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. తీవ్రంగా గాయపడిన గౌతమ్ను తల్లిదండ్రులు గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. గతంలోనూ మండలంలోని అనేక గ్రామాల్లో అనేక మంది చిన్నపిల్లలు, పెద్దలపై కుక్కలు దాడి చేశాయని, గ్రామంలో వీధి కుక్కల సంఖ్య తీవ్రంగా ఉందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, మండల ప్రజలు కోరుతున్నారు.

గాయపడిన గౌతమ్

ఉరుకుందలో నామినేషన్ల పర్వం

ప్రజాశక్తి - కౌతాళం

ఆలయ ధర్మకర్తల నియామకం కోసం కూటమి ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది.

నామినేషన్లు వేస్తున్న నాయకులు

గురువారం ఉరుకుందలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో నామినేషన్ల పర్వం కొనసాగింది. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ గాండ్ల చెన్న బసప్ప, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి కొట్రేష్ గౌడ్, దొడ్డన గౌడ్, ఎల్లారెడ్డి, నరసింహులు, తిమ్మక్క, నరసన్న, తలారి లలితమ్మలు నామినేషన్లను ఆలయ పర్యవేక్షకులు వెంకటేష్కు అందజేశారు. అంతకుముందు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు సుధీర్ రెడ్డి, కురుగోడు, ప్రభాకర్, రమేష్ గౌడ్, ప్రకాష్, శివప్ప గౌడ్, మంజు, సోమన్న, సిద్ధు, రాజబాబు, నరసింహ పాల్గొన్నారు.

రహదారిపై గుంతల పూడ్చివేత

ప్రజాశక్తి - చిప్పగిరి

రహదారిపై పడిన గుంతలకు మాజీ జడ్పిటిసి,

చదును చేయిస్తున్న మాజీ జడ్పిటిసి మీనాక్షి నాయుడు

టిడిపి సీనియర్ నాయకులు మీనాక్షి నాయుడు మరమ్మతులు చేయించారు. మండలంలోని ఏరూరు–చిప్పగిరికి వెళ్లే ఆరు కిలోమీటర్ల రహదారి గుంతలమయంగా, కంకర తేలి ఉంది. జడ్పిటిసి సొంత నిధులతో గత రెండు రోజుల నుంచి టిప్పర్ ద్వారా గ్రావెల్ను తోలించి రహదారిని చదును చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహనదారులు ఇబ్బందులు పడుతుండడంతో గ్రావెల్ వేసి చదును చేయించినట్లు తెలిపారు. సాగునీటి సంఘం అధ్యక్షులు ధనుంజయ, మిరపకాయల చంద్ర, మాజీ ఎంపిటిసి నరసింహులు, రాజన్న, హరి పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ను రద్దు చేయాలి

- వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్

ప్రజాశక్తి- దేవనకొండ

ముఖచిత్ర ఆధారిత రిజిస్ట్రేషన్ (ఎఫ్ఆర్ఎస్)ను రద్దు చేసి అంగన్వాడీలకు పని భారం తగ్గించాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, ఎఐటియుసి నాయకులు నరసారావు డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ల ఆధ్వర్యంలో గురువారం తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీలు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. అంగన్వాడీ యూనియన్ (సిఐటియు), ఎఐటియుసి నాయకులు జ్యోతి, లక్ష్మి, శ్రీదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంగన్వాడీలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని విమర్శించారు. పిల్లలు, మహిళలకు వివిధ రకాల వస్తువుల పంపిణీ, తదితర అంశాల్లో ప్రభుత్వం వివిధ యాప్లు రూపొందించిందని చెప్పారు. ప్రభుత్వం 2జి సెల్ఫోన్ ఇవ్వడం ద్వారా సరయిన నెట్వర్క్ లేక సమాచారం అప్లోడ్ చేయలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్ఫోన్లు వెనక్కి ఇచ్చారని, యాప్లను రద్దు చేయాలని కోరారు. అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. అంగన్వాడీలు మాబునీ, మంగమ్మ, సరోజ, లక్ష్మీదేవి, వెంకటలక్ష్మి, మద్దమ్మ, సరస్వతి, కృష్ణవేణి, సువర్ణ పాల్గొన్నారు. **ఆదోని** ఐసిడిఎస్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ, ప్రాజెక్టు అధ్యక్షులు వరలక్ష్మి, సిఐటియు నాయకులు తిప్పన్న, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, బి.వీరారెడ్డి, ప్రాజెక్టు నాయకులు గీత, రేణుక హాజరై మాట్లాడారు. సెక్టార్ నాయకులు సోమక్క, రిజ్వానా, కరుణ, లక్ష్మీదేవి, లలిత, రాజేశ్వరి పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** సిడిపిఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి సిడిపిఒకి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు సోమప్ప సర్కిల్లో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, డిటికి వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ యూనియన్ (సిఐటియు) ప్రాజెక్టు కార్యదర్శి బి.గోవర్ధనమ్మ, అధ్యక్షులు శైలజ, పట్టణ కార్యదర్శి నాగలక్ష్మి, సిఐటియు నాయకులు పి.గోవిందు, బి.రాముడు, నాయకులు మున్ని, సుమిత్ర, యుఎం.నాగ లక్ష్మి, గ్రేసమ్మ, మేరీ, లక్ష్మీదేవి, గిరీశ్వరి, మల్లేశ్వరి, లతా రాణి, నిర్మల, భాగ్యలక్ష్మి, తులసి, గౌసియా భాను, నాగ శిరోమణి, సరిత, జయమ్మ, శంషాద్ భాను పాల్గొన్నారు. **ఆలూరు** తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ జి.దీపకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, నాయకులు షాకీర్, అంగన్వాడీలు జయశ్రీ, భారతి, పుష్పావతి, విశాలక్షి పాల్గొన్నారు. **ఆస్పరి** ఐసిడిఎస్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. యూనియన్ నాయకులు విశ్వకుమారి, రూతమ్మ అధ్యక్షత వహించారు. సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు, ఎఐటియుసి తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తి, రంగన్న మాట్లాడారు. అనంతరం సిడిపిఒ మద్దమ్మకు వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ యూనియన్ మండల కార్యదర్శి ప్రమీలమ్మ, నాగమణి, పద్మ, రాధా, మస్తాన్ బీ, చిట్టెమ్మ, ఛాయాదేవి, రాణి, సరోజమ్మ, ముంతాజ్, లక్ష్మి, ఫాతిమా, రజిని, నీలమ్మ, శివలీల పాల్గొన్నారు. **కోసిగి** తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తహశీల్దార్ వేణుగోపాల్కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు, వీరేష్, యూనియన్ నాయకులు హెబ్సిబారాణి, లూసమ్మ, వరలక్ష్మి, సుజాత పాల్గొన్నారు. **గోనెగండ్ల** ప్రభుత్వాస్పత్రి ప్రాంగణం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ రఘువీరాకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు వరలక్ష్మి, పుష్పావతి, సిఐటియు మండల అధ్యక్షులు బి.కరుణాకర్, సిఐటియు మండల కార్యదర్శి నబి రసూల్, అంగన్వాడీలు రామలింగమ్మ, శార దమ్మ, నాగలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, కృష్ణవేణి, ఎల్.నాగమ్మ, సుజాత, రషీద, అనురాధ, జైతున్ బీ, జయలక్ష్మి, హెల్పర్స్ సరస్వతి, వెంకటలక్ష్మి, మాబి, షేకున్ బీ, సోమక్క, లింగమ్మ పాల్గొన్నారు. **మంత్రాలయం** ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, సిడిపిఒ రాజేశ్వరి దేవికి వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి భీమేశ్వరి, ప్రాజెక్టు ఉపాధ్యక్షులు విశాలాక్షి పాల్గొన్నారు. **హాలహర్వి** తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. సిఐటియు నాయకులు కృష్ణ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

దేవనకొండలో ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీలు

ఆదోని...

ఆలూరు

ఎమ్మిగనూరు

ధ్యాన్చంద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

క్రీడల్లోనూ రాణించాలి

- డిప్యూటీ డిఇఒ వెంకటరమణారెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని డిప్యూటీ డిఇఒ వెంకట రమణారెడ్డి ఆకాంక్షించారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆదోని మున్సిపల్ మైదానంలో ఆదోని జోనల్ స్థాయి బాలుర, బాలికల కబడ్డీ పోటీలు నిర్వహించారు. ముందుగా హాకీ మాంత్రికుడు ధ్యాన్చంద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదోని జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో జోనల్ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు ఆదోని జోన్ పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి 17 బాలుర జట్లు, 10 బాలికల జట్ల మధ్య కబడ్డీ పోటీ నిర్వహించినట్లు తెలిపారు. ఎంఇఒ–2 శ్రీనివాసులు, మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, నెహ్రూ మెమోరియల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఫయాజ్ అహ్మద్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు నరసయ్య పాల్గొన్నారు. గెలుపొందిన జట్లకు ఈనెల 29న బహుమతుల ప్రదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

రైతులకు ఎరువులు పంపిణీ

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని వగరూరు, సూగూరు గ్రామాల్లోని రైతులకు ఎఒ తిరుమల రెడ్డి ఆధ్వర్యంలో తహశీల్దార్ కె.రమాదేవి ఎరువులను పంపిణీ చేశారు. గురువారం ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున అందజేశారు. ఒక్కో గ్రామానికి ప్రభుత్వం నుంచి 12.60 మెట్రిక్ టన్నుల ఎరువులు రాగా మొత్తం 560 బస్తాలను ప్రతి గ్రామంలో 140 మంది రైతుల చొప్పున రెండు గ్రామాలకు 280 బస్తాలను అందజేశారు. అనంతరం వగరూరు గ్రామ సమీపంలో ఉన్న గురు రాఘవేంద్ర ప్రాజెక్టును పరిశీలించారు. ఆర్ఎస్కె సిబ్బంది శేఖర్, మాదన్న, విఆర్ఎ అనిల్ ఉన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

- టిడిపి ఎంపిటిసిల బహిష్కరణ

ప్రజాశక్తి - చిప్పగిరి

మండల కార్యాలయంలో నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం గురువారం కోరం లేక వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఒ అల్లాబకాష్ పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభిస్తామని ప్రజాప్రతినిధులకు, అధికారులకు కార్యాలయం నుంచి సర్క్యులర్ అందజేశారు. మధ్యాహ్నం 12.30 గంటలైనా సమావేశం ప్రారంభం కాలేదు. విసుగు చెందిన టిడిపి ఎంపిటిసి ఎల్లంకి రజిని 'సమయం 12 గంటలు కావస్తోంది. ఇంకెప్పుడు సమావేశం ప్రారంభం చేస్తార'ని ఎంపిడిఒ అల్లాబకాష్ను ప్రశ్నించారు. ఎంపిడిఒ సమాధానమిస్తూ... ఎంపిపి అత్యవసర పని మీద రాలేకపోయారని, వైస్ ఎంపిపి పద్మావతి వస్తున్నారని, వచ్చిన వెంటనే ప్రారంభిస్తామని తెలిపారు. కొంతసేపు కూర్చొని విసుగు చెందిన ఎంపిటిసి ఎల్లంకి రజిని, బెల్డోన భీమలింగ, డేగలహాల్ సర్పంచి నీలకంఠ, కుందనగుర్తి సర్పంచి కొండా పురుషోత్తం కార్యాలయం ముందుకొచ్చి తాము సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఎల్లంకి రజిని మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా తామే సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోవడం బాధాకరమన్నారు. ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు సమయపాలన పాటించే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. అనంతరం కార్యాలయంలో ఎంపిడిఒ ఆధ్వర్యంలో మండల, గ్రామస్థాయి అధికారులంతా ఆస్పరి మండలం చిగిలి గ్రామంలో నీటికుంటలో పడి మృతి చెందిన ఆరుగురు విద్యార్థులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, ఎఒ శ్రీరామ్ ప్రవీణ్, డాక్టర్ అఫ్రోజ్ జహన్, ఎంఇఒ సావిత్రి, పిఆర్ ఎఇ సోమప్ప, ఆర్డబ్ల్యుసి ఎఇ మల్లికార్జున్ రెడ్డి, ఏపీవో జుబేర్ అహ్మద్, ఎపిఎం శివయ్య, హౌసింగ్ ఎఇ విజయ్ కుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఈరమ్మ పాల్గొన్నారు.

బహిష్కరిస్తున్న టిడిపి ప్రజాప్రతినిధులు

ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కప్పట్రాళ్ల, జిల్లేడుబుడకల, మాదాపురం, ఓబులాపురం, పి.కోటకొండ, చెల్లల చెలిమల గ్రామాలకు చెందిన మహిళలకు 50 శాతం సబ్సిడీతో 180 కుట్టు మిషన్లను అక్షిత స్వచ్ఛంద సంస్థ ద్వారా రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధికి సాధించాలని కోరారు. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టిన అక్షిత స్వచ్ఛంద సంస్థ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, మహేష్, స్వామి, రంగడు పాల్గొన్నారు.

ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని ప్రయాణం : సిపిఎం

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని బదినేహాల్ నుంచి జి.హోసల్లి, బదినేహాల్ నుంచి కౌతాళానికి ప్రయాణించాలంటే ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉందని సిపిఎం మండల కన్వీనర్ ఈరన్న తెలిపారు. గురువారం బదినేహాల్ టు జి.హోసల్లి, బదినేహాల్ టు కౌతాళం రోడ్లను సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డుకిరువైపులా ముళ్లకంపులు, గుంతలు పడి రోడ్డంతా పాడైపోయిందని, పాఠశాల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రైతులు పొలాలకు ఎరువులు తీసుకెళ్లాలంటే అవస్థలు పడుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం రహదారులను బాగుచేసి ప్రజలకు సౌకర్యవంతంగా చేయాలని, లేకపోతే రోడ్డు దిగ్బంధం చేపడతామని హెచ్చరించారు. సిపిఎం సీనియర్ నాయకులు బి.ఉలిగయ్య, శంకర్, మాబాష, బందేనవాజ్ పాల్గొన్నారు.

ఆర్ఎస్కెలో తనిఖీలు

ప్రజాశక్తి కౌతాళం

మండలంలోని రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రైతు సేవా కేంద్రాలు, ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గురువారం తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి, ఎఒ శేషాద్రి పలు రైతు సేవా కేంద్రాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి స్టాక్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా అందించాలని సూచించారు. గోడౌన్లో ఉంచిన ఎరువులు, పురుగు మందుల స్టాక్ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి వారి రికార్డులను సక్రమంగా నిర్వహించలేదని, రికార్డులను సరిగ్గా నిర్వహిస్తూ యూరియాను రైతులకు అందజేయాలని ఆదేశించారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోసిగిలో చోరీ

ప్రజాశక్తి - కోసిగి

కోసిగిలో 9వ వార్డు దుర్గా నగర్లో నివాసముంటున్న తుప్పల భీమయ్య ఇంట్లో గురువారం మధ్యాహ్నం 1 గంట సమయంలో దొంగతనం జరిగింది. భీమయ్య మాట్లాడుతూ... తాను ఉదయం 9 గంటలకు రైల్వే డ్యూటీకి వెళ్లినట్లు, తన భార్య 12 గంటల సమయంలో కోసిగి గ్రామం పక్కనే ఉన్న పెళ్లికి వెళ్లి తిరిగి 3 గంటలకు ఇంటికి చేరుకున్నారని తెలిపారు. తన ఇంట్లో ఉన్న కిటికీలో నుంచి దూరి బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారం, 60 తులాల వెండి, రూ.10 వేల నగదు దొంగిలించినట్లు వివరించారు. సంఘటన స్థలానికి పోలీసులు వచ్చి తనిఖీ చేశారు.

సామూహిక అష్టోత్తర పారాయణం

ప్రజాశక్తి - మంత్రాలయం

రాఘవేంద్రస్వామి కొలువైన శ్రీమఠంలో స్వామి వారి సామూహిక అష్టోత్తర పారాయణం చేపట్టారు. గురువారం గురుపుష్య యోగా సందర్భంగా, పండితులతో ఉపన్యాసం నిర్వహించారు. అనంతరం రాఘవేంద్ర స్వామి అష్టోత్తర పారాయణం భక్తితో సామూహికంగా భక్తులతో కలిసి నిర్వహించారు.

బాధిత రైతులకు న్యాయం చేస్తాం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని ఐరన్గల్ గ్రామ సమీపంలో ఉన్న రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇప్పించి న్యాయం చేస్తామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. గురువారం సర్పంచి రామాంజనేయులు అధ్యక్షతన, తహశీల్దార్ వేణుగోపాల్, టిడిపి నాయకులు ముత్తురెడ్డి ఆధ్వర్యంలో రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా నష్టపోయిన రైతులతో మాట్లాడారు. 16 మంది

రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

రైతులకు గాను నాలుగు ఎకరాల 99 సెంట్లు (4.99) భూమి ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల్లో పోవడంతో ప్రభుత్వంతో మాట్లాడి వారికి నష్టపరిహారం త్వరలో అందజేస్తామని తెలిపారు. మండలంలో ఇప్పటికే 14 గ్రామాలు భూ సర్వే పూర్తయిందని, మిగిలిన గ్రామాల్లోనూ త్వరగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గతంలో ఇచ్చిన పాసు పుస్తకాలకు బదులు కొత్తగా కూటమి ప్రభుత్వం రాజముద్రతో ప్రవేశపెట్టిన పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు పంపిణీ చేయాలని తెలిపారు. అనంతరం స్థానిక వ్యవసాయ కార్యాలయాన్ని సందర్శించి పక్కనే ఉన్న గోడౌన్ను తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందుల్లేకుండా యూరియాను పంపిణీ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

పింఛన్ల తొలగింపు అన్యాయం : వ్యకాస

ప్రజాశక్తి - దేవనకొండ

వికలాంగుల పింఛన్ల తొలగింపు అన్యాయమని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ తెలిపారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయం ముందు వికలాంగుల సంఘం నాయకులు ధోని అధ్యక్షతన ధర్నా నిర్వహించారు.

ధర్నా చేస్తున్న వికలాంగులు

ఈ సందర్భంగా వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్, ఎఐటియుసి జిల్లా నాయకులు ఎం.నరసరావు, వికలాంగుల సంఘం నాయకులు ఆనంద్, బజారి, వీరేష్ మాట్లాడారు. వైద్యుల నిర్లక్ష్యం, వికలాంగుల పట్ల ప్రభుత్వ వైఖరి వల్ల వందశాతం అంగవైకల్యం ఉన్న వికలాంగులు పింఛన్లు కోల్పోయారని తెలిపారు. పింఛన్లు తొలగింపును వెంటనే ఆపాలని, అర్హులైన వారందరికీ పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కళ్ల ముందు వంద శాతం అంగవైకల్యం కనబడుతున్నా నిర్లక్ష్యంగా 40 నుంచి 45 శాతంగా పేర్కొనడం దారుణమని విమర్శించారు. వికలాంగులు పింఛనుతో గౌరవంగా బతుకుతున్నారని, పింఛన్లు రాకుంటే వారి భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించారు. అనర్హుల పింఛను తొలగింపు సబబేనని, వంద శాతం ఉన్న వారికి తొలగింపు ఏ మేరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. అన్యాయంగా అర్హుల పింఛన్లు తొలగిస్తే ఎంపిడిఒ కార్యాలయం ముందే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం రీ వెరిఫికేషన్కు అనుమతులు ఇచ్చిందని, సచివాలయంలో సంబంధిత పత్రాలు అందజేస్తే అందరికీ న్యాయం జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వ్యకాస మండల ఉపాధ్యక్షులు యూసుఫ్ బాష పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టడంలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి - నందవరం

నీటి వృథాను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పైపులు డ్యామేజ్ అయి నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. నందవరం బీరప్ప దేవాలయం దగ్గర కుళాయి మెయిన్ పైపు లీకై చాలా నీరు వృథాగా పోతోంది. కొన్ని నెలలుగా నీరు వృథాగా పోతున్నా అధికారులు అటువైపు చూస్తూ వెళ్తున్నారు తప్ప దాన్ని మరమ్మతులు చేపట్టడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ నీరు పెద్ద ఎత్తున పోవడంతో దానిపై అడ్డంగా రాయిని పెట్టారు. ఆ నీరు ఇంటి ముందుకొచ్చి నిల్వ ఉంటున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వృథాగా పోతున్న నీరు

IN THE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION): ALUR
I.A.No.234 /2023 IN O.S.No.118/2018

Between:
K.Anumanathappa. ...Petitioner.
V/s
Smt.H.Shanthamaa and two Others ...Respondents.

TO: **R-5**
1.Smt. Sumangali W/o Mallikarjuna, Hindu, aged about 55 years, House-Wife, Resident of H.No.5-251, Holagunda Village & Mandal, Kurnool District.

Whereas the above named the petitioner filed an application Under Order 22 Rule 4 and Section 151 CPC for implead you legal heirs of Respondent No.1 as Respondent No.5. You hereby directed to appear before this Honorable Court on dt.28.08.2025 at 10-30 AM., either in persons or your Advocate and file counter if any, failing which the matter will be decided in your absence and you will be set Ex-Parte.

Hearing Date: 28.08.2025

SHRI.Y.R.MALLIKARJUNA,
ADVOCATE FOR PETITIONER.
ADONI-518301,
KURNOOL DISTRICT.
Cell No: 9849314050

యూరియా పంపిణీ లో అక్రమాలుండరాదు

కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి - వెల్దుర్తి

జిల్లాలో యూరియా పంపిణీ లో అక్రమాలు జరగకూడదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు.గురువారం వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లి రైతు సేవా కేంద్రం లో రైతులకు యూరియా పంపిణీ పై జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ యూరియా పంపిణీ రికార్డులను పరిశీలించారు.. గ్రామానికి ఇప్పటి వరకు ఎంత యూరియా వచ్చింది, రైతులకు ఎలా పంపిణీ చేశారని నిపరిశీలించారు. ఆన్లైన్ వివరాలతో పాటు ఆఫ్లైన్ లో ఏ రైతుకి ఎంత ఇచ్చారు అని వివరాలను రిజిస్టర్ లో ఎంట్రీ చేయడం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా ఎంత మేరకు యూరియా అవసరం ఉందని కలెక్టర్ మండల వ్యవసాయ అధికారిని ఆరా తీశారు. 300 బ్యాగుల యూరియా ఈ గ్రామానికి అవసరం ఉందని మండల వ్యవసాయ అధికారి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. యూరియా వచ్చిన వెంటనే ఈ గ్రామానికి 300 బ్యాగ్ లు పంపించాలని కలెక్టర్ జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. ఈక్రాఫ్ బుకింగుపై వివరాలు తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, మండల వ్యవసాయ అధికారి అక్బర్ బాషా , తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

మండలం పరిధిలోని ఆమడగుంట్ల గ్రామంలో గురువారం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కెడిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి నూతన గ్రామ సచివాలయంను, రైతు భరోసా కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలు వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో గ్రామాలన్నీ అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక దృష్టి సారించడమే కాకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఉద్యోగులకు సూచించారు. కెడిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. అనంతరం రైతు భరోసా కేంద్రం ఆవరణంలో మొక్కలు నాటారు. తొలుత టిడిపి శ్రేణులు వారికి ఘన స్వాగతం పలికారు. గ్రామ సర్పంచి వరలక్ష్మి , కోడుమూరు మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి , మండల కార్యదర్శి రాజు, పట్టే కృష్ణ, త్రివేద్, చిల్ల బండబాష, రామగిడ్డయ్య, మధు, బాలకృష్ణ, రవీంద్ర గౌడ్, వెంకటేశ్వర్లు, నారాయణ, అధికారులు, గ్రామ పెద్దలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎపి ఎన్‌జిఒ నేతలను కలిసిన జిల్లా నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అనంతపురం జిల్లాలో జరిగిన ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమానికి వచ్చిన ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, డివి రమణను జిల్లా ప్రధాన కార్యదర్శి జవహార్‌లాల్, జిల్లా కోశాధికారి భాస్కర్‌నాయుడు, జిల్లా నాయకులు సాంబశివరెడ్డి కలిశారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులను జిల్లా నేతలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై రాష్ట్ర నేతల దృష్టికి తీసుకువెళ్లారు.

హై స్పీడ్ ఇంటర్నెట్ , 400కు పైగా టీవీ ఛానళ్లు

9 ఒటిటిలు అపరిమితమైన వాయిస్ కాలింగ్ - బిఎస్ఎన్ఎల్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి.రమేష్

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి.రమేష్

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా భారత ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బిఎస్ఎన్ఎల్ వినియోగదారుల కోసం ఒకే ప్లాన్ ద్వారా హై స్పీడ్ ఇంటర్నెట్, టీవీ ఛానళ్లు. ఒటిటిలు , వాయిస్ టెలిఫోన్ సేవలను అతి తక్కువ అందుబాటు ధరల్లో అందించడానికి కొత్తగా ట్రిపుల్ ప్లే సర్వీసులను ప్రారంభించిందని బిఎస్ఎన్ఎల్ కర్నూలు బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి.రమేష్ తెలిపారు. గురువారం కర్నూలు బిఎస్ఎన్ఎల్ భవన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ట్రిపుల్ ప్లే సర్వీసుల ద్వారా వినియోగదారులు నెలకు కేవలం రూ.400 చెల్లించి హై స్పీడ్ ఇంటర్నెట్ ఈటీవీ ,మా టీవీ, జెమినీ టీవీ, జీ టీవీ లాంటి మరెన్నో ప్రముఖ ఛానల్లతో సహా 400కు పైగా టీవీ ఛానళ్లు బీ 9 ఓటిటి అప్లికేషన్లు , భారతదేశమంతటికి అపరిమితమైన వాయిస్ కాల్స్ చేసుకునే సౌకర్యాలను ఆస్వాదించవచ్చని తెలిపారు. ఈ ప్లాను కర్నూలు బిజినెస్ ఏరియా లోని కర్నూలు , నంద్యాల జిల్లాలోని అన్ని నగరాలు, పట్టణాలు , గ్రామాలలో అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ ప్లాన్‌ను నమోదు చేసుకోవడానికి 1800 4444 కు వాట్సాప్ ద్వారా హాయ్ అని మెసేజ్ పంపడం ద్వారా, లేదా సమీపంలోని బిఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్లను సంప్రదించడం ద్వారా కానీ లేదా https://bookmyfiber.bsnl.co.in వెబ్ సైట్ ను సందర్శించి ఆన్‌లైన్‌లో కనెక్షన్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు . అదనంగా, ఇప్పటికే ఉన్న బిఎస్ఎన్ఎల్ ఎఫ్‌టిటి హెచ్ కస్టమర్లు కేవలం రూ.140తో రీఛార్జ్ చేసుకోవడం ద్వారా టీవీ సేవలను పొందవచ్చని తెలిపారు. కర్నూలు బిజినెస్ ఏరియా పరిధిలోని వినియోగదారులందరూ ఈ ప్రత్యేక ఆఫర్‌ను సద్వినియోగం చేసుకొని బిఎస్ఎన్ఎల్ అత్యంత నాణ్యతా సేవలను ఆస్వాదించాలని కోరారు.

బిఎస్ఎన్ఎల్ నుండి కేవలం రూ.1/- కే ఫ్రీడమ్ ప్లాన్.

30 రోజులు పాటు ప్రతిరోజు 2 జిబి డేటా , అపరిమితమైన కాల్స్, 100 ఎస్ఎంఎస్ లు , ఉచిత సిమ్ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆత్మనిర్భర భారత్‌లో భాగంగా బిఎస్ఎన్ఎల్ పూర్తి స్వదేశీ సాంకేతికతతో 4జి సేవలను దేశవ్యాప్తంగా ప్రారంభించింది. స్వాతంత్ర్య దినోత్సవం మాసం అయిన ఆగస్టు నెలలో బిఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్ ఆఫర్ ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ నెలలో ఎవరైనా కొత్త సిమ్ ను బిఎస్ఎన్ఎల్ నుండి పూర్తి ఉచితంగా పొంది కేవలం రూ 1/- రీఛార్జ్ తో , 30 రోజులపాటు ప్రతిరోజు 2 జిబి డేటా, అపరిమితమైన కాల్స్ 100 ఎస్ఎంఎస్ లు పొందవచ్చన్నారు. ఇతర ఆపరేటర్ నుండి బిఎస్ఎన్ఎల్ కు పోర్ట్ అయిన వారికి కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందని, వినియోగదారులు దగ్గర్లో ఉన్న బిఎస్ఎన్ఎల్ సేవా కేంద్రం లేదా రిటైలర్‌ను సందర్శించి ఈ ఉచిత ఆఫరును పొందగలరని, 4జి ను ప్రారంభించిన తరువాత డేటా వాడకం లో మంచి వద్ధిని నమోదు చేసుకున్న తరుణంలో ఈ ఆఫర్ వినియోగదారులకు మంచి ఉపయోగకరంగా ఉంటుందని ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి .రమేష్ తెలిపారు.

బిఎస్ఎన్ఎల్ తో కలిసి బిజినెస్ చేయడానికి ఉపాధి అవకాశాలు

లోకల్ కేబుల్ ఆపరేటర్స్ ఎల్ సిఒలకు, మల్టిపుల్ సర్వీస్ ఆపరేటర్స్ ఎంఎస్ఓ లకు 50 శాతం కమిషన్ తో బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ ద్వారా ఇంటర్నెట్ , టీవీ సేవలు కస్టమర్లకు అందించడానికి ఉపాధి అవకాశాలు ఉన్నాయి. వివరాల కోసం పార్ట్‌నర్ సపోర్ట్ గ్రూప్ ఎస్‌డిఇ జానకిరామ్ ను మొబైల్ నెంబరు 9422464999 ద్వారా సంప్రదించగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ డీజీఎం కె. రాజేశ్వరరావు, ఐఎఫ్ఎ డి. శ్రీలత, ఎజిఎం డివిజనల్ ఇంజనీర్లు , ఇతర అధికారులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపునకు ప్రజలు సహకరించాలి

-స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి
-ప్రకతి ప్రేమికులకు ఉచితంగా మొక్కల పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో విస్తృత హరితీకరణ కార్యక్రమం భాగంగా వేలాది మొక్కలను నాటుతున్నామని, దీనికి ప్రకృతి ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల సహకరించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ కోరారు. గురువారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. నగరాన్ని పచ్చగా తీర్చిదిద్దేందుకు ప్రతి వాడ, ప్రతి కాలనీ, ప్రతి సంస్థ నుంచి చురుకైన భాగస్వామ్యం అవసరం ఉందన్నారు. జూన్ మాసం నుండి పదివేల మొక్కలు నాటినట్లు వెల్లడించారు. అశోక్ నగర్ పంప్‌హౌస్‌లో కానుగ, సీతాఫల్, బాదం, వేప, రెయిన్‌ట్రీ, తదితర మొక్కలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, ప్రకృతి ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పరిసరాల్లో ఉన్న ఖాళీ స్థలాలు, మైదానాల్లో సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. మొక్క నాటడం మొదటి అడుగు మాత్రమే, దానికి గాను రోజువారీగా నీరు పోయడం, కంచె వేయడం, పశువుల నుంచి రక్షణ, ప్లాస్టిక్, చెత్త పడకుండా చూడడం వంటి సంరక్షణే అసలు ఫలితం ఇస్తుందన్నారు. ప్రతి ఇంటి ముందు, ప్రతి దుకాణం వద్ద, ప్రతి కార్యాలయం, ఎక్కడ మొక్క నాటితే అక్కడ బాధ్యత గల 'ప్లాంట్ గార్డియన్'గా ఒకరు ముందుకు రావాలని సూచించారు. మొక్క బతికితేనే నగరం ఊపిరి పీలుస్తుందని పేర్కొన్నారు.ప్రజలకు కమిషనర్ సూచనలు: ప్రతీ మొక్కకు రోజుకు కనీసం 5నుంచి10 లీటర్లు నీరు పోయాలి (ఉదయం/సాయంత్రం). చుట్టూ చిన్న కంచె లేదా గార్డ్ ఏర్పాటు చేస్తున్నాం. మట్టి ఎత్తుగా మాడ్లా చేసి మూలాలకు తడి నిల్వ ఉండేలా చూడండి. వారం వారానికి ఒకసారి మొక్క చుట్టూ కలుపు తీసి శుభ్రం చేయండి, ప్లాస్టిక్, చెత్త వేయకుండా ఆపండి. కాలనీ స్థాయిలో వాట్సాప్, సాధన గ్రూప్ ఏర్పాటుచేసి మొక్క సంరక్షకులను నామినేట్ చేయండి. పౌరులు తీసిన సంరక్షణ ఫొటోలు, సమస్యలు, సూచనలు కింద ఇచ్చిన హెల్ప్‌లైన్ పంపండి.

హెల్ప్‌లైన్ అండ్ ఫిర్యాదు,వాట్సాప్/ఫోటో అప్‌డేట్ 7422992299

మన నగరాన్ని బాధ్యతగా ప్రతి మొక్కను మన పిల్లల భవిష్యత్‌గా భావించి కాపాడుకుందాం. కర్నూలు మరింత పచ్చగా, శుభ్రంగా, చల్లగా మారేందుకు ప్రతి పౌరుడి భాగస్వామ్యం కీలకం అన్నారు.

అస్మిత రగ్బీ లీగ్ పోటీలను ప్రారంభించిన టిజివి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

నగర శివారులోని ఆదర్శ విద్యామందిర్ క్రీడా మైదానంలో ఏర్పాటుచేసిన అస్మిత రగ్బీలీగ్ పోటీలను రాజ్యసభ మాజీ సభ్యులు టిజి. వెంకటేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఆదర్శ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ హరికిషన్, రగ్బీ క్రీడా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేంద్ర, సాయి, కోచ్ కాశి రావు, ప్రైవేట్ పిఇటిల జిల్లా సంఘం అధ్యక్షుడు చిన్న సుంకన్న , హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్‌తో పాటు వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. టిజి. వెంకటేష్ మాట్లాడుతూ ఈ క్రీడా పోటీలకు తమ పాఠశాల క్రీడామైదానాన్ని కేటాయించిన ఆదర్శ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ హరికిషన్ ను అభినందించారు. జిల్లాకు నూతనంగా పరిచయమైన రగ్బీ క్రీడలో క్రీడాకారులు క్రమశిక్షణ, అంకితభావంతో సాధన చేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. క్రీడల్లో సాధన చేయడం వల్ల మెదడు మరింత చురుగ్గా పనిచేస్తుందన్నారు. దీనివల్ల ఐక్యూ పెరగడంతో పాటు చదువులోనూ రాణిస్తారని తెలిపారు. అనంతరం ఆదర్శ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ హరికిషన్, రగ్బీ క్రీడా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు సురేంద్ర తదితరులు మాట్లాడుతూ కర్నూలు నగరంలో క్రీడలను ప్రోత్సహించడంలో టిజి. వెంకటేష్, రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అందిస్తున్న సహకారం మరువలేనిదని చెప్పారు. అనంతరం టిజి. వెంకటేష్‌ను శాలువా కప్పి మెమెంటో అందజేసి సన్మానించారు.

రైతును రాజు చేయడమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-సి బెళగల్

పల్లె ప్రజలకు, వ్యవసాయ కూలీలకు, సాగు నీరు అందించి రైతులను కూడా రాజును చేయడమే టిడిపి ప్రభుత్వం ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. గురువారం బ్రాహ్మణ దొడ్డిలో గ్రామ పెద్దలు వడ్డే లక్ష్మన్న, వెంకటేశ్వర్లు సమక్షంలో రైతులతో వెళ్లి కుంట తూముకు పూజలు చేసి సాగునీటిని విడుదల చేశారు. ఇక్కడే ఆయన మాట్లాడుతూ కుంటలను, చెరువులను పూర్తి స్థాయిలో నింపి నియోజకవర్గంలో రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. పంటలను సమృద్ధిగా పండించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నుండి నాయకులు, కార్యకర్తలు పలువురు. పాల్గొన్నారు.

గ్యాస్ సిలెండర్ పేజీ గాపడిన దంపతులు, ధ్వంసమైన మొబైల్ వ్యాను

గ్యాస్ లీకై దంపతులకు గాయాలు

ప్రజాశక్తి- వెల్దుర్తి

గ్యాస్ లీక్ అయి దంపతులకు గాయాలు అయిన ఘటన వెల్దుర్తిలో చోటు చేసుకుంది. వెల్దుర్తిలో నివాసం ఉంటున్న యేసు రాజు, సుకన్య దంపతులు వెల్దుర్తి జాతీయ రహదారి 44లో ఇటిగా సమీపంలో మొబైల్ క్యాంటీన్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. రోజులాగే గురువారం ఉదయం క్యాంటీన్ నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు గ్యాస్ లీక్‌అయి మంటలు వ్యాప్తి చెందాయి. దాంతో ఇరువురికి గాయాలు అయ్యాయి. స్థానికులు వారిని వెంటనే వెల్దుర్తి సిపెచ్‌సికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


క్విజ్ పోటీల మ్యానువల్‌ను విడుదల చేస్తున్న విసి , కల్కూర, మన్సూర్‌రహిమాన్

బహుముఖ ప్రజ్ఞాశాలి టంగుటూరి

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

టంగుటూరి ప్రకాశం పంతులు బహుముఖ ప్రజ్ఞాశాలి అని ఇంచార్జ్ విసి ఆచార్య వి.వెంకట బసవరావు అన్నారు. గురువారం క్లస్టర్ యూనివర్సిటీ, సాహితీ సదస్సు ఆధ్వర్యంలో టంగుటూరు ప్రకాశం పంతులు 153వ జయంతి వేడుకల సందర్భంగా క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ మ్యానువల్‌ను విసి వి. వెంకట బసవరావు, రిజిస్ట్రార్ డాక్టర్ జి. శ్రీనివాస్ విడుదల చేశారు. అనంతరం విసి వి.వెంకట బసవరావు మాట్లాడుతూ ప్రకాశం పంతులు సిఎంగా ప్రమాణ స్వీకారం కర్నూలు జిల్లాలోనే చేయడం ఎంతో గర్వకారణం అన్నారు. ఈ క్విజ్ పోటీలకు కర్నూలులోని వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా శాంతి, కెవిఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకట్ రెడ్డి, సిల్వర్ జూబ్లీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ బిఆర్ ప్రసాద్ రెడ్డి, మానవ శక్తి పరిశోధనా కేంద్రం వ్యవస్థాపకులు మన్సూర్ రహమాన్, క్లస్టర్ యూనివర్సిటీ డీన్‌లు అక్తర్‌భాను, నాగరాజు శెట్టి, మహమ్మద్ వాహీద్, అధ్యాపకులు ఫామిదా, ఎల్లా కృష్ణ, జయలక్ష్మి, రాధా రమణి, సవిత, సునీత, డి.పార్వతి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు హుస్సేనయ్య , బాలపీర

తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

అక్రమంగా తొలగించిన పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని సిపిఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం మండల కార్యదర్శి హుస్సేనయ్య, మండల నాయకులు రాఘవేంద్ర, బాలపీర బాధితులతో కలిసి కర్నూలు మండలం ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్ధాంతరంగా లక్షల మంది పెన్షన్లు తొలగించడం దుర్మార్గమన్నారు. కర్నూలు మండలంలో దాదాపు 200 మంది వికలాంగులు, వృద్ధులు, వితంతువుల పింఛన్లు తొలగించడం అన్యాయ అన్నారు. అనంతరం ఎంపిడిఒ రఘునాథ్‌కు వినతిపత్రం అందజేశారు. దాదాపు 40 మంది బాధితులు వస్తే సరిగ్గా మాట్లాడకుండా వ్యవహరించిన ఎంపిడిఒ పై అసహనం వ్యక్తం చేశారు. బాధితులందరికీ న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. మాజీ సర్పంచ్ వెంకటస్వామి, సిపిఎం నాయకులు అహ్మద్ హుస్సేన్ బాధితులు పాల్గొన్నారు.

వెల్దుర్తిలో అఖిలపక్ష ర్యాలీ

ప్రజాశక్తి- వెల్దుర్తి

మండల కేంద్రమైన వెల్దుర్తిలో గురువారం అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో మండలాన్ని కర్నూలు జిల్లాలోని కొనసాగించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ముందుగా పాత బస్టాండ్ కూడలిలోని తెలుగు తల్లి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. పాత బస్టాండ్ నుండి ప్రభుత్వ కళాశాల మీదగా తహశీల్దార్ కార్యాలయం వరకు 'ఆదోని వద్దు కర్నూలు ముద్దు' అని నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. తహశీల్దార్ చంద్రశేఖర వర్మకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మాపెంపిపి దశరథరామిరెడ్డి, టిడిపి జిల్లా నాయకులు సుబ్బారాయుడు, రమాకాంత రెడ్డి, బలరాం గౌడ్, బోయినపల్లి కాంతారెడ్డి, జడ్‌పిటిసి సుంకన్న తదితరులు పాల్గొన్నారు. అనంతరం బొమ్మిరెడ్డి పల్లె రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయడానికి వచ్చిన జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాకు మెమోరాండం అందజేశారు.

'అశోక'లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



కర్నూలు అశోక మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇన్నోవేషన్స్ ఇన్ ఇంజనీరింగ్ కాన్సెప్ట్ నుండి ఇంప్లిమెంటేషన్ వరకు' అనే అంశంపై ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రోగ్రామ్‌ను జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (జెఎన్‌టి యుఎ), అనంతపురం లోని ఫ్యాకల్టీ డెవలప్మెంట్ సెంటర్ స్పాన్సర్ చేసింది. ఈనెల 21 నుండి 25 వరకు ఈ కార్యక్రమం ఆన్‌లైన్ మోడ్లో నిర్వహిస్తున్నారు. ఎఐ టెక్నాలజీలను సిద్ధాంత స్థాయి నుండి వాస్తవ ఇంజనీరింగ్ ప్రాజెక్టుల వరకూ ఎలా వినియోగించుకోవచ్చో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. దీని ద్వారా అధ్యాపకులు కొత్త పద్ధతుల్లో సమస్యలు పరిష్కరించడం, ఆటోమేషన్ ప్రాసెస్లను మెరుగుపరచడం నేర్చుకుంటారని తెలిపారు. ఈ ప్రత్యేక శిక్షణలో జెఎన్‌టియుఎ అనంతపురం పరిధిలోని వివిధ కళాశాలలకు చెందిన 50 మంది అధ్యాపకులు పాల్గొంటున్నారు. దేశంలోని ప్రముఖ ఐఐటిలు, నిట్‌లు ఇతర ప్రథమశ్రేణి సంస్థల నుండి వచ్చిన నిపుణులు ప్రతి రోజూ రెండు సెషన్లలో తమ జ్ఞానం, అనుభవాన్ని పంచుకుంటున్నారు. ప్రారంభ కార్యక్రమంలో సిఇఒ డాక్టర్ హరీష్ కృష్ణ మాట్లాడుతూ ఆధునిక ఇంజనీరింగ్ రంగంలో ఎఐ మార్పులను తెస్తుందన్నారు. ఈ తరహా శిక్షణ కార్యక్రమాలు ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు చేరడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ నవీన్ మాట్లాడుతూ ఎఫ్‌డిపి ద్వారా అధ్యాపకులు కటింగ్ – ఎడ్జ్ ఎఐ టూల్స్ నేర్చుకుని బోధన, పరిశోధనలో ఉపయోగిస్తారని తెలిపారు. భవిష్యత్తులో ఎఐపరిజ్ఞానం లేకుండా ఇంజనీరింగ్ అసంపూర్ణమనితెలిపారు. చేశారు. ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ మాగేశ్వరి, కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌ఎ. శివకుమార్ మాట్లాడుతూ ఇంత ప్రతిష్టాత్మకమైన ప్రోగ్రాం నిర్వహించే అవకాశం ఇచ్చినందుకు జెఎన్‌టియుఎకు ధన్యవాదాలు తెలిపారు. పాల్గొనేవారికి ఉత్తమమైన అనుభవం ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రోగ్రాం ముగిసిన తర్వాత ఎవాల్యుయేషన్ టెస్ట్ నిర్వహించి, విజయ వంతంగా పూర్తి చేసిన అధ్యాపకులకు సర్టిఫికేట్లు అందజేయనున్నారు.

టెక్నికల్ అసిస్టెంట్ దౌర్జన్యం

ప్రజాశక్తి-పత్తికొండ రూరల్

పత్తికొండ మండలంలోని టెక్నికల్ అసిస్టెంట్ మహేష్‌పై చర్యలు తీసుకోవాలని హెచ్.మల్లేశ్వరమ్మ ఎంపిడిఒ కవిత గురువారం ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ నాకు వారసత్వంగా పత్తికొండ మండల పరిధిలోని దూదేకొండ గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 721/2,757/3,757/1 లో మొత్తం విస్తీర్ణం 10.52 ఎకరాల భూమిని మా తాత అవ్వలు సంపాదించి తదనంతరం మా నాన్న హెచ్.మల్లన్న , మా అమ్మ రంగమ్మల పేర్లు మీద రెవెన్యూ రికార్డులో ఎక్కించుకుని వ్యవసాయం చేస్తున్నామన్నారు. మాతండ్రికి ఐదుగురు ఆడపిల్లలు, ఒక మగ పిల్లవాడు సంతానం మొదటగా మా తల్లి రంగమ్మ మా తమ్ముడు సుంకన్న చనిపోయారు. తర్వాత మా నాన్న మరణించాక ఉమ్మడి ఆస్తులకు వారసులుగా కుటుంబ సభ్యులంతా భూమిని వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడిపే వాళ్ళం. కొన్ని రోజుల తర్వాత కుటుంబంలో ఒకరినొకరు మధ్య మనస్పర్థలు రావడంతో భూమిని భాగాలు చేయాలని పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టుకుని మాట్లాడాం. మా తమ్ముని భార్య కాంతమ్మ భూమి ఇచ్చేది లేదని, నా కుమారుని పేరు మీద భూమి ఉందని చెప్పడంతో పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టులో పార్టిషన్ సూట్‌ఫైల్ చేశామన్నారు. 230/2025 నమోదు అయిందని, కేసు అయిపోయిన తర్వాత ఆ పొలంలోకి ఎవరు పోరాదని నిర్ణయించుకొని బీడుగా వుంచామన్నారు. గత కొన్ని రోజుల క్రితం మాకు సంబంధించిన భూమిని తుగ్గలి మండలం మారెళ్ళ గ్రామానికి చెందిన టెక్నికల్ అసిస్టెంట్ లొడ్డ మహేష్ అక్రమంగా మా పొలంలోకి ప్రవేశించి పంట వేశారన్నారు. అది తెలిసి జులై 18న పొలంములోకి వెళ్లగా మా అక్కడే ఉన్న లొడ్డ మహేష్ అతని భార్య మాపై దాడి చేశారన్నారు. పత్తికొండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని, కేసునమోదు చేశారన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగం చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకుపాల్పడుతున్నారని ఆయనపై ఉన్న భూమిని తొలగించి మాకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కళ్యాణి ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆస్పరి మండలం చిగలి గ్రామంలో ఐదవ తరగతి చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతి చెందిన కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎఐసిసి సభ్యులు , మాజీ ఎమ్మెల్సీ ఎం. సుధాకర్ బాబు డిమాండ్ చేశారు.

గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు కాంగ్రెస్ తరఫున ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేస్తున్నామన్నారు. విద్యార్థుల కుటుంబాలకు రూ.20 లక్షల ఆర్థిక సహాయం, రెండు ఎకరాల భూమి, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. కాంగ్రెస్ నాయకులు బజారన్న, బి బతుకన్న, షేక్ ఖాజా హుస్సేన్, ఈ లాజరస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న డాక్టర్ కె.స్వాతి

సుందరయ్య స్ఫూర్తి కేంద్రం సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సుందరయ్య స్ఫూర్తి కేంద్రం అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ కె. స్వాతి పేర్కొన్నారు. గురువారం కర్నూలు బి క్యాంపు ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నాగస్వామి నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ కె.స్వాతి సుందరయ్య, స్ఫూర్తి కేంద్రం జిల్లా నాయకులు ధనుంజయ, ఎలా గువేరా పాల్గొన్నారు. విజేతలయిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.కార్యక్రమంలో అధ్యాపకులు రామకృష్ణ, సోమేశ్, పటేల్, ఉల్గోజీ రావు, గిరిజారాణి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

ఆర్‌జిఎన్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ కర్నూలు జిల్లా కమిటీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు జిల్లా ఆస్పరి మండలం చిగిలి గ్రామంలో ఆరుగురు చిన్నారులు మృతి చెందడంపై ఆర్‌జిఎన్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ జిల్లా కమిటీ గురువారం ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం అసోసియేషన్ రాయలసీమ ఇన్‌చార్జి బి.విజయ్ కుమార్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నీలం సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఆజాద్ మాట్లాడుతూ ఐదవ తరగతి చదువుతున్న శశికుమార్, కిన్నెరసాయి, సాయి కిరణ్, భీమావీరేంద్ర,వినయ్ మహబూబ్ బాష అనే ఆరుగురు విద్యార్థులు ఆడుకుంటూ నీటి కుంటలో పడి మరణించడంపై విచారం వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్ ఉన్న చిన్నారుల మృతి వారి కుటుంబాలకు తీరని కడుపుకోతను మిగిల్చిందన్నారు. తక్షణమే మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు ప్రభుత్వం భరోసా కల్పించి, ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.